సాక్షి ఆదిలాబాద్

గురువారం । 7 । డిసెంబర్ । 2023

మాట ఇచ్చారు.. మరవకండి



ఎన్నికల ప్రచారం సందర్భంగా బోథ్ డివిజన్ ఏర్పాటు చేస్తామని ప్రధాన పార్టీలన్నీ హామీలిచ్చాయి. వాటిని మరువద్దంటున్నారు ఈ ప్రాంతవాసులు.

8లో▸

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

ఆదిలాబాద్‌టౌన్: మిచాంగ్ తుపాన్ కారణంగా ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గురువారం పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెటింగ్ కార్యదర్శి మధుకర్ ప్రకటనలో తెలిపారు. సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లను నిలిపివేశారని పేర్కొన్నారు. విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
26.0/17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహనీయుడు అంబేద్కర్

- కలెక్టర్ రాహుల్‌రాజ్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయుడని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని షెడ్యూల్డు కులాల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీఆర్డీవో కిషన్, ఆయా సంఘాల నాయకులు, అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఉపకార వేతనాల మంజూరు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోగా రెన్యూవల్, ఫ్రెష్ పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులు ఈ పాస్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

మాతా, శిశు మరణాలు నియంత్రించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మాతా, శిశు మరణాలు నియంత్రించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయ సమావేశ మందిరంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్లిష్ట గర్భిణులను సకాలంలో గుర్తించాలన్నారు. ప్రసవ గడువుకు వారం ముందే వారిని ఆసుపత్రికి తరలించాలన్నారు. జిల్లాలో గర్భిణులు, చిన్నారుల మరణాల రేటు సున్నాకు తగ్గించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు స్వేచ్ఛ అలేఖ్య, పీవో డీటీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక..పల్లె పోరు

పంచాయతీల్లో వార్డుల స్వరూపం ఇలా..	
జనాభా	వార్డులు
300 వరకు	5
300-500	7
500-1500	9
1500-3000	11
3,000-5,000	13
5000-10,000	15
10,000-15,000	17
15,000-25,000	19
25,000- ఆపైన	21



మావల గ్రామం

- పంచాయతీ ఎన్నికలకు కసరత్తు
- సిద్ధం కావాలని ఈసీ ఆదేశం
- త్వరలో మోగనున్న నగారా
- ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి

కైలాస్‌నగర్: పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనుంది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచిస్తూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల గడువు వచ్చే ఏడాది (2024) ఫిబ్రవరి 2తో ముగియనుంది. ఆ లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఈసీ భావిస్తుంది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి షురు కానుంది. రాజకీయ పార్టీలు సైతం పంచాయతీ సమరానికి సై అంటున్నాయి.

ఫిబ్రవరి 2న ముగియనున్న గడువు

జిల్లాలో 468 గ్రామ పంచాయతీలుండగా 3,830 వార్డులున్నాయి. ఇందులో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి అప్పట్లో ఎన్నికలు జరుగలేదు. దాన్ని మున్సిపాలిటీగా మార్చాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. అయితే ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం కావడంతో అది సాధ్యపడలేదు. ప్రస్తుతం మిగతా వాటితో పాటు ఉట్నూర్‌ను సైతం జీపీగా పరిగణిస్తూ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. బేల మండలంలో కొబ్బాయి పంచాయతీ నుంచి మాంగ్రూడ్ కొత్త జీపీగా ఏర్పడింది. ఎన్నికల సమయం నాటికి పాలకవర్గ గడువు ఉండటంతో అక్కడ అప్పట్లో ఎన్నికలు జరగలేదు. దీంతో ఆయా పంచాయతీల్లో పాలకవర్గాలు లేవు. అక్కడ ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. మిగతా 466 పంచాయతీల పాలకవర్గాల గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీతో ముగియనుంది. దీంతో జీపీ ఎన్నికలు గడువులోపు నిర్వహించాలని ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఈ మేరకు సన్నద్ధం కావాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

కసరత్తు షురూ..

పంచాయతీ పాలకవర్గాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బందితో పాటు గ్రామాల వారీగా ఓటర్ల జాబితా, బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేసుకోవాలని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈసీ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పంచాయతీ ఓటర్లు 650 లోపు ఉంటే ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్నారు. అంతకు మించితే అదనపు పోలింగ్ కేంద్రం తప్పనిసరి. అలాగే 200 మంది ఓటర్లకు ఇద్దరు, 400 మందికి ముగ్గురు, 400–650 మందికి నలుగురు అధికారులను నియమించున్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక పీవో, ఒక ఏపీవో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే పంచాయతీల వారీగా ఉన్న జనాభా ప్రకారం వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టనున్నారు. ఇటీవల జనాభా పెరిగిన నేపథ్యంలో వార్డుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు సైతం సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని ఉట్నూర్, బోథ్, ఇచ్చోడ వంటి మేజర్ గ్రామ పంచాయతీల్లో అధిక మంది ఓటర్లు ఉన్నారు. అక్కడ ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే అక్కడ వార్డుల సంఖ్య కూడా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లను సైతం సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. వారు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు.

ఈసీ ఆదేశానుసారం చర్యలు

గ్రామ పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం. వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నాం. పోలింగ్‌కు అవసరమైన పీఓ, ఏపీవోల వివరాలను అన్ని శాఖల నుంచి సేకరిస్తున్నాం. ఆ వివరాలను టీపోల్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. జిల్లాలో 7,150 బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెస్తాం. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తాం.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

టెట్ ఉంటేనే ప్రమోషన్

- ఉపాధ్యాయుల్లో గుబులు
- మినహాయింపునకు ఎన్‌సీటీఈ నిరాకరణ
- అయోమయంలో సీనియర్లు



టెట్ ఉన్నవారికే పదోన్నతి కల్పించాలని డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) తెచ్చిన తంటా ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళనకు గురిచేస్తుంది. టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు మాత్రమే పదోన్నతులకు అర్హులని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యూకేషన్ (ఎన్‌సీటీఈ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్‌లో జరిగిన పదోన్నతులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు ఎన్‌సీటీఈకి లేఖ రాశారు. పదోన్నతులు పొందే ఉపాధ్యాయులకు టెట్ అవసరమా.. లేదా, టీచర్లకు టెట్ రాసేవరకు పదోన్నతులకు అవకాశం కల్పించాలని అందులో కోరారు. అయితే మినహాయింపు ఇవ్వడానికి ఎన్‌సీటీఈ రెండు రోజుల క్రితం నిరాకరించింది. తప్పనిసరిగా టెట్ ఉండాలని పేర్కొంది. దీంతో గురువుల్లో గుబులు మొదలైంది. ఏళ్లుగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు పదోన్నతులకు దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పదోన్నతికి టెట్ తప్పనిసరి..

అక్టోబర్‌లో ఉపాధ్యాయుల పదోన్నతులు జరిగాయి. అప్పటికే ప్రధానోపాధ్యాయుల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ప్రమోషన్, ఎస్‌ఏలకు బదిలీలు చేపట్టారు. ఇదే సమయంలో కొంత మంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. మద్రాస్ హైకోర్టు ప్రమోషన్‌కు టెట్ తప్పనిసరి అని తీర్పునిచ్చిందని వారు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల తరఫున వాదనలు విన్న కోర్టు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతికి టెట్ తప్పనిసరి అని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ ముందుకు సాగకుండా నిలిచిపోయింది. పీఎస్ హెచ్‌ఎం, సాంఘిక శాస్త్రం 1989 డీఎస్సీ, బయోసైన్స్ వారికి 1996 డీఎస్సీ, గణితం, ఫిజికల్ సైన్స్ 2002 డీఎస్సీ వారికి పదోన్నతులు జరిగే అవకాశాలు లేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో దాదాపు 220 మంది ఉపాధ్యాయులు పదోన్నతులకు దూరమయ్యే పరిస్థితి. వీరికంటే జూనియర్లు అయి ఉన్నప్పటికి టెట్ పాసైన ఉపాధ్యాయులు మాత్రం పదోన్నతులు పొందనున్నారు.

నిర్ణయాన్ని స్వాగతిస్తాం



టెట్ పాసైన ఉపాధ్యాయులకు మాత్రమే పదోన్నతులు కల్పించాలని ఎన్‌సీటీఈ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. జిల్లాలో వందలాది మంది టీచర్లు టెట్ ఉత్తీర్ణత సాధించారు. వీరిని కాదని టెట్‌లో అర్హత సాధించని వారికి పదోన్నతులు ఇవ్వడం సరికాదు. నిబంధనల ప్రకారం ప్రమోషన్ కల్పించాలి. నిలిచిపోయిన ఎస్జీటీ బదిలీ, పదోన్నతులను ప్రభుత్వం త్వరగా చేపట్టేలా చూడాలి. ఈ విషయమై కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రితో పాటు సీఎంను కలిసి విన్నవిస్తాం.

– విజయ్‌కుమార్, ఉపాధ్యాయుడు

ప్రత్యేక టెట్ నిర్వహించాలి



ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం ప్రత్యేక టెట్ నిర్వహించాలి. 30 ఏళ్లుగా విద్యాబోధన చేస్తున్న టీచర్లు టెట్ అర్హత లేకపోవడంతో పదోన్నతులు పొందని పరిస్థితి ఉంది. అర్హత పెంచుకోవడం ద్వారా ఉపాధ్యాయులు మరింత నాణ్యమైన బోధన చేయవచ్చు. విద్యాహక్కు చట్టాన్ని గౌరవిస్తాం. ఎన్‌సీటీఈ రెండు రోజుల క్రితం ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులకు తప్పనిసరిగా టెట్ వర్తింపజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

– వృకోధర్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

హోంగార్డులు పెన్షన్ పథకంలో చేరడం ఉత్తమం

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- ఘనంగా హోంగార్డుల రైజింగ్ డే

ఆదిలాబాద్‌టౌన్: హోంగార్డులు పెన్షన్ పథకంలో చేరడం ఉత్తమమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హోంగార్డు రైజింగ్ డేను స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని హోంగార్డు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హోంగార్డులకు పదవి విరమణ అనంతరం ప్రభుత్వ పెన్షన్ ఉండదని, పెన్షన్ పథకంలో చేరడం మంచిదని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం హోంగార్డులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్, పోతారం శ్రీనివాస్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు స్వామి, నవీన్, మురళి, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హోంగార్డు ఆఫీస్ అధికారులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

సమష్టి కృషితోనే ఎన్నికలు విజయవంతం

ఆదిలాబాద్‌టౌన్: సమష్టి కృషి ఫలితంగానే జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించామని ఎస్పీడి.ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో నెల వారీ నేర సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. అలాగే రానున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా చొరవ చూపాలన్నారు. జిల్లాలో స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గత నెలలో వర్టికల్స్‌లో ప్రతిభ కనబరిచిన 18 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్.నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, పోలీసు ముఖ్య కార్యాలయం ఏవో భక్తప్రహ్లాద్, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, అశోక్, సైదారావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, నరేశ్, ప్రేమ్ కుమార్, సతీశ్, డి సాయినాథ్, రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్లు మురళి,నవీన్,స్వామి, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, ఎస్‌బీ, మినిస్ట్రీయల్ స్టాఫ్, అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా తీర్పునకు కట్టుబడి ఉంటాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా తీర్పునకు తాము కట్టుబడి ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉండి ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. కార్యకర్తలెవరు మనోవేదనకు గురికావద్దని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తాము తెచ్చిన పనులకు కొబ్బరికాయలు కొట్టడం కాకుండా దమ్ముంటే కొత్త పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు సవాల్ విసిరారు. తమ హయాంలో జిల్లాకు ఐటీ టవర్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కళాశాలలను తీసుకొచ్చామని పేర్కొన్నారు. అలాగే పెన్‌గంగ ప్రాజెక్టు కోసం రూ.2వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ అజయ్, సతీశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓడిన చోటే గెలుపు

- గత ఎన్నికల్లో పరాజయం చెంది ఈ సారి విక్టరీ
- మెజార్టీ మస్తుగానే..
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు

ఆ నేతలు కోల్పోయిన చోటే వెతుక్కున్నారు.. ఓడిన చోటే గెలుపొందారు. గత ఎన్నికల్లో పరాజయం చెంది ఈసారి విక్టరీ కొట్టారు. లోపాలను పూడ్చుకుని కొత్త వ్యూహాలను అమలు పరిచారు. అధిక ఓట్లు పొంది మెజార్టీ కూడా మస్తుగా సాధించారు. మొత్తంగా విజయం కైవసం చేసుకున్నారు. వారే వీరు.. –సాక్షి, ఆదిలాబాద్

గత, ఈ ఎన్నికల్లో ఆయా అభ్యర్థులు సాధించిన ఓట్లు

అభ్యర్థిపేరు (పార్టీ)	నియోజకవర్గం	2018లో ఓట్లు	2023లో ఓట్లు
ప్రేమ్‌సాగర్‌రావు (కాంగ్రెస్)	మంచిర్యాల	70,512	1,05,945
వినోద్ (కాంగ్రెస్)	బెల్లంపల్లి	43,750	82,217
మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ)	నిర్మల్	70,714	1,06,400
కోవ లక్ష్మి (బీఆర్‌ఎస్)	ఆసిఫాబాద్	65,617	83,036
అనిల్ జాదవ్ (బీఆర్‌ఎస్)	బోథ్	28,206	76,792
పాయల్ శంకర్ (బీజేపీ)	ఆదిలాబాద్	47,444	67,608
హరీశ్‌బాబు (బీజేపీ)	సిర్పూర్	59,052	63,702

గడ్డం వినోద్..



బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గడ్డం వినోద్ తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్‌కు చెందిన దుర్గం చిన్నయ్యపై 36,878 ఓట్ల మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి చెందారు. ఈ సారి మాత్రం విజయం సాధించారు. 1999లో తొలిసారి చెన్నూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వినోద్ ఓటమి పాలయ్యారు. 2004లో చెన్నూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. అప్పుడు సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా వ్యవహరించారు.

పాయల్ శంకర్..



ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పాయల్ శంకర్ తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్‌కు చెందిన జోగు రామన్నపై 6,692 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. గత ఎన్నికల కంటే ఈ సారి 20 వేలకు పైగా ఓట్లు సాధించారు. ఒక సారి టీడీపీ, రెండు సార్లు బీజేపీ అభ్యర్థిగా ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయనకు విజయం దక్కలేదు. ఈ ఎన్నికల్లో మరో సారి అదృష్టం పరీక్షించుకుని సక్సెస్ సాధించారు.

ప్రేమ్‌సాగర్‌రావు..



మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రేమ్‌సాగర్‌రావు తన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన రఘునాథ్‌పై 66,116 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్‌సాగర్‌రావుకే అత్యధిక మెజార్టీ దక్కింది. గత ఎన్నికల్లోనూ మంచిర్యాల నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి చెందారు. ఈ సారి గతంతో పోలిస్తే 35వేల ఓట్లు అధికంగా సాధించారు.

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి..



నిర్మల్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్‌కు చెందిన ఇంద్రకరణ్‌రెడ్డిపై 50,703 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన ఈ ఎన్నికల్లో పార్టీ మార్చి విజయదుందుభి మోగించారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి 35 వేల ఓట్లు అధికంగా సాధించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఈయన మూడో స్థానానికి పరిమితం అయ్యారు. 2009లో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పాల్వాయి హరీశ్‌బాబు..



సిర్పూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పాల్వాయి హరీశ్ బాబు తన సమీప అభ్యర్థి బీఆర్‌ఎస్‌కు చెందిన కోనేరు కోనప్పపై 3088 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన ఓటమి చెందారు. ఆ ఎన్నికలతో పోల్చితే ఈ సారి 4600పై చిలుకు ఓట్లు అధికంగా సాధించారు.

అనిల్ జాదవ్..



బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన అనిల్ జాదవ్ తన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన సోయం బాపూరావుపై 22,800 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2018 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన అనిల్ జాదవ్ మూడో స్థానంలో నిలిచారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి ఆయన 48వేల ఓట్లు అధికంగా సాధించడం గమనార్హం. రెండుసార్లు కాంగ్రెస్, ఒక సారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఈయనకు విజయం దక్కలేదు. ఈ సారి బీఆర్‌ఎస్ నుంచి విజయదుందుభి మోగించారు.

కోవలక్ష్మి..



ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కోవలక్ష్మి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన శ్యామ్‌నాయక్‌పై 22,798 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన ఆమె అప్పుడు సమీప ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు చేతిలో స్వల్పంగా 171 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. గత ఎన్నికల కంటే ఈ సారి 17వేల ఓట్లు అధికంగా సాధించారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచే పోటీ చేసిన ఆమె అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి సక్కుపై గెలుపొందడం ద్వారా మొదటి సారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి కోవ లక్ష్మికి టికెట్ ఇచ్చినప్పటికీ అదే పార్టీలో కొనసాగిన సక్కు ఆమెకు మద్దతు నిచ్చారు.

క్లుప్తంగా

గోదావరిలో మునిగి భక్తుడి మృతి


మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న స్థానికులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మ వారి దర్శనానికి వచ్చిన భక్తుడు నాగరాజు(35) గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మేడ్చల్ జిల్లా గజ్జులతండాకు చెందిన వరుసకు బావ, బామర్దులైన శ్రీనివాస్, నాగరాజులు బుధవారం బాసరకు చేరుకున్నారు. గోదావరి నది వద్దకు వచ్చిన నాగరాజు గుండుగీయించుకుని స్నానానికి నీటిలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలోనే మునిగి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ వెల్లడించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

గుడిహత్నూర్: ఆటో బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని జాతీయ రహదారి 44పై డోంగర్‌గావ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... లక్ష్మణ్ ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హైవే అంబులెన్సులో అతడిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

నేటి నుంచి అరుణాచల టూర్‌కి బుకింగ్

ఆదిలాబాద్: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలగిరికి ప్రత్యేక సర్వీసు ఈనెల 24వ తేదీన నడపడం జరుగుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీ రూ. 5000వేలు ఉంటుందని పేర్కొన్నారు. ప్యాకేజీలో భాగంగా కాణిపాకం, వేలూరు, అరుణాచల గిరి పుణ్యక్షేత్రాల్లో దర్శనం చేసుకోవచ్చన్నారు. ఈ స్పెషల్ ప్రయాణికుల టూర్ ప్యాకేజ్ ముందస్తు రిజర్వేషన్ గురువారం నుంచి ప్రారంభం అవుతుందని, ముందస్తు రిజర్వేషన్ కొరకు ఆదిలాబాద్ బస్ స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్, www.tsrtconline.inలో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7382840334, 7382800975 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సెమీఫైనల్‌కు ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్: గద్వాల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 బాలుర క్రికెట్ పోటీల్లో ఆదిలాబాద్ (ఉమ్మడి) జిల్లా జట్టు సత్తా చాటింది. బుధవారం నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ జట్లను ఓడించి సెమీ ఫైనల్ చేరుకుందని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. ఈ నెల 5న ప్రారంభమైన పోటీలు గురువారంతో ముగియనున్నాయని తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఐటీఐ అప్రెంటిషిప్ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ ఓ ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. ఐటీఐ డీజిల్ మెకానిక్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి రీటీర్చి ఇఇట్చ్ఫ్లజీఛి ఁటజజీ ఇజీ ఛీజీర్చి॰టజ ద్వారా ఆన్‌లైన్‌లో ఆదిలాబాద్ లోకేషన్‌లో ఈ నెల 15వ తేదీలోగా తమ అర్హత వివరాలతో నమోదు చేసుకోవాలని కోరారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేసి ఉమ్మడి జిల్లాలోని 6 ఆర్టీసీ డిపోలలో అప్రెంటిషిప్ కోసం కేటాయించడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాట ఇచ్చారు...మరవకండి

- అధికారంలోకి వస్తే బోథ్ డివిజన్ ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి హామీ
- డిసెంబర్ 31లోగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది.. రేవంత్ హామీ నెరవేరేనా..?
- ఆశగా ఎదురుచూస్తున్న బోథ్ ప్రజలు


బోథ్ మండల కేంద్రం

బోథ్: 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది.. అధికారలోకి వచ్చిన నెలరోజుల్లోనే అంటే డిసెంబర్ 31లోగా బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తాం. కార్యాలయాలను తిరిగి బోథ్‌లోనే ఏర్పాటు చేస్తాం' బోథ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి అన్నమాటలివి.

బోథ్‌లో ఎన్నికల ప్రచారం బోథ్ డివిజన్ ఏర్పాటు హామీలపైనే జరిగింది. ప్రముఖ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తాము అధికారంలోకి వస్తే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చాయి. ప్రతి గ్రామంలో నాయకులు తిరుగుతూ ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని పార్టీలు రెవెన్యూ డివిజన్ హామీ ఇవ్వడంతో రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడినా బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ పైనే భారం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సీఎం కాబోతుండటంతో బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తారని ఇక్కడి ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వస్తే డిసెంబర్ 31లోగా బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డిపై బోథ్‌ను డివిజన్ చేయాల్సిన బాధ్యత ఉంది. ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం.. బోథ్‌ను డిసెంబర్ 31లోగా డివిజన్‌గా చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. బోథ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు డివిజన్ ఏర్పాటుపై చొరవ చూపాలని కోరుతున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బోథ్‌లో బీఆర్ఎస్..

తాము అధికారంలోకి వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ అధినేతలు రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు బోథ్‌ను డివిజన్ చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాగా బోథ్‌లో మాత్రం బీఆర్ఎస్ నుంచి అనిల్ జాదవ్ గెలుపొందారు. అయితే ఇరు పార్టీలు డివిజన్ చేస్తామని ప్రకటించాయని, కాబట్టి ఇరు పార్టీలు బోథ్‌ను డివిజన్ చేయడానికి చొరవ చూపాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ డివిజన్ హామీ ఇచ్చారు...

పీసీసీ అధ్యక్షుడిగా చెప్పున్నా గెలిచిన వెంటనే డిసెంబర్ 31లోగా రెవెన్యూ డివిజన్ చేస్తామని రేవంత్‌రెడ్డి బోథ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సభలో పేర్కొన్నారు. మరుసటి రోజునే ఇచ్చోడ మండల కేంద్రంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇరు పార్టీలు రెవెన్యూ డివిజన్‌పై హామీ ఇవ్వడం, బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ సైతం తాను గెలిస్తే బోథ్ రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని ప్రధాన పార్టీలు డివిజన్‌పై హామీ ఇవ్వడంతో ఇప్పుడు డివిజన్ ఏర్పాటు చేయడం అనివార్యంగా మారింది.

మాట ఇచ్చారు.. నెరవేర్చండి



తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బోథ్‌ను డివిజన్ చేస్తామని హామీ ఇచ్చాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం డిసెంబర్ 31లోగా బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి. డివిజన్ ఏర్పాటుకు నాయకులు చొరవ చూపాలి.

– అల్లం సాయికృష్ణ

డివిజన్ చేయాల్సిందే



బోథ్ అన్ని రంగాల్లో నిరాదారణకు గురైంది. బోథ్‌ను డివిజన్‌గా చేస్తే అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుంది. బోథ్ డివిజన్ కావడానికి అన్ని అర్హతలున్నాయి. అన్ని పార్టీలు డివిజన్ చేస్తామని హామీలు ఇచ్చాయి. ఇచ్చిన హామీల ప్రకారం .. బోథ్‌ను డివిజన్ చేసి అభివృద్ధి చేయాలి. ఇందుకు నాయకులు చొరవ చూపాలి.

– గట్ల బలరామకృష్ణ, బోథ్

నా కొడుకుని కాపాడండి..


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగచైతన్య

- విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో బాలుడు..
- కోతులను తరిమే క్రమంలో ప్రమాదం..
- తండ్రి ఆటో డ్రైవర్, తల్లి బీడీ కార్మికురాలు...
- ఇప్పటికే రూ.5లక్షల ఖర్చు
- మరో రూ.10లక్షలు అవుతాయంటున్న వైద్యులు
- దాతలు ఆదుకోవాలని కుటుంబీకుల వేడుకోలు


నాగచైతన్య

దస్తురాబాద్: విద్యుత్ షాక్‌కు గురైన బాలుడిని ఆస్పత్రిలో చేర్పించగా వైద్యానికి డబ్బులు లేక నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఎలాగైన కొడుకును కాపాడుకోవాలని పడరానిపాట్లు పడుతున్నారు. దస్తురాబాద్ మండల కేంద్రానికి చెందిన సిదం మొగిలి, సునీత దంపతులకు కూతురు, కుమారుడు నాగచైతన్య (14) ఉన్నారు. నాగచైతన్య ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా తల్లి బీడీలు చుడుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది. అయితే తండ్రి మొగిలి మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, కోతులను గ్రామం నుంచి తరలించాలనే ఉద్దేశంతో నిర్మల్ మండలం నర్సపూర్ గ్రామం నుంచి కోతుల పట్టే బోనును అద్దెకు తీసుకొచ్చాడు. బోనును కోతులు బాగా సంచరించే ప్రాంతంలో పెట్టాడు. రోజువారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆటో నడిపేందుకు వెళ్లాడు. ఇంతలో నాగచైతన్య కోతులను ఎలాగైనా బోనులోకి వెళ్లేలా చేయాలని ఉద్దేశంతో ఇంటి పక్కన ఉన్న భవనంపైకి వెళ్లి కోతులను తరిమే క్రమంలో ఇంటిపై గల 11కేవీ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబీకులు వెంటనే ఖనాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఒక రోజులోనే రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యాయి. వైద్యానికి మరో రూ.10లక్షల వరకు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో చేసేది లేక తల్లిదండ్రులు అల్లాడుతున్నారు. దాతలు తమ కుమారుడిని కాపాడండి అని వేడుకుంటున్నారు.

సాయమందించే దాతలు..

– రమేశ్, గూగుల్, ఫోన్ పే నం.88974 15572

'మిషన్ లక్ష్యం' పకడ్బందీగా అమలు చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి


మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయి

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులను 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ్ఞమిషన లక్ష్యం౅౅ 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. బుధవారం కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు, ఏటీడీవోలు, పీఎంఆర్సీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మిషన్ లక్ష్యం ప్రాధాన్యత, రోజు వారి ప్రణాళికలకు సంబంధించిన కార్యాచరణను వివరించారు. ప్రతీ రోజు ప్రత్యేక తరగతులు, ప్రతీ రోజు ఉదయం స్లిప్ టెస్టులను నిర్వహించాలన్నారు. సీ, డీ కేటగిరి విద్యార్థులకు ప్రత్యేక కార్యచరణ ద్వారా బోధన చేయాలన్నారు. ప్రతీ ఉపాధ్యాయునికి విద్యార్థులను దత్తత ఇవ్వాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా చూడాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక మెను అమలు చేయాలన్నారు. 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ప్రతి మూడు వారాలకు స్లిప్ టెస్టుల తరువాత గ్రాండ్ టెస్టులను నిర్వహించాలని ఆదేశించారు. వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా పూర్తి స్థాయిలో విద్యార్థులపై దృష్టి సారించి బోధించాలన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలో ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏసీఎంఓలు, ఏటీడీఓలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలకు ఏర్పాట్లు చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి


మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయి

ఉట్నూర్‌రూరల్: తొలిసారిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో నిర్వహించే ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి సూచించారు. బుధవారం ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పీవో మాట్లాడారు. జనవరి 18 నుంచి 21 వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తారని, రాష్ట్రంలో ఏడు సొసైటీలకు చెందిన రాష్ట్ర జట్లు పాల్గొంటాయని వివరించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, హాకీ, ఫుట్‌బాల్, రెజ్లింగ్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, బ్యాట్మింటన్, టెన్నీకాయిట్, తైక్వాండో క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. దాదాపు 4500 నుంచి 5వేల మంది క్రీడాకారులు, అధికారులు, కోచ్‌లు, మేనేజర్లు హాజరవుతారన్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని సూచించారు. మైదానాల సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, క్రీడల నిర్వాహణను తటస్థ వ్యక్తుల ద్వారా నిర్వహించాలని, అందుకు రాష్ట క్రీడా సంఘాల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో డీడీలు దిలీప్‌కుమార్, రమాదేవి, డీటీడీఓలు గంగారాం, అంబాజీ, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థ సారథి, ఏసీఎంఓలు జగన్, శివాజీ, ఏటీడీఓలు క్రాంతి పాల్గొన్నారు.

హెచ్‌ఎంవీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్ ట్రైనింగ్ నూతన బ్యాచ్ జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభించినట్లు డిపో మేనేజర్ కల్పన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 15,600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, శిక్షణ కార్యక్రమం 30రోజుల పాటు ఉంటుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్కే. యూసుఫ్ సెల్: 7382840349 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రిలో యువతి మృతి

మంచిర్యాలక్రైం: ఆపరేషన్ వికటించి ఓ యువతి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం టికాణపల్లెకు చెందిన మేడం శంకరయ్య–శంకరమ్మ దంపతుల కుమార్తె రమాదేవి (23) అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 3న పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు గర్భసంచికి గడ్డలు ఉన్నాయని, ఆపరేషన్ లేకుండా మిషన్ ద్వారా గడ్డలు తీసే ప్రయత్నం చేస్తామని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన వైద్యులు ఒంటిగంటకు మిషన్ ద్వారానే గడ్డలు తొలగించామని చెప్పి ఐసీయూలోనే ఉంచారు. మంగళవారం పేషెంట్ కండీషన్ సీరియస్ కావడంతో మళ్లీ ఆపరేషన్ చేసే క్రమంలో రమాదేవి మృతి చెందిందని వైద్యులు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

నాగోబాను దర్శించుకున్న ఎమ్మెల్యే తల్లిదండ్రులు


ఎమ్మెల్యే బొజ్జు తల్లిదండ్రులను సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ తల్లిదండ్రులు భీంరావ్, గిరిజబాయిలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువలతో సన్మానించి నూతన వస్త్రాలను బహూకరించారు. నాగోబా ఆశీస్సులతో తమ కొడుకు ఎమ్మెల్యేగా విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, మెస్రం వంశం పెద్దలు మెస్రం బాటిరావ్, మెస్రం శేఖ్‌నాథ్, మెస్రం లింబారావ్, గ్రామస్తులు ఆత్రం ఆశోక్, తోడసం సాగర్, కోవ భీంరావ్ ఉన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్ బుధవారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో నిర్మల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటుగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వారి ఇరువురిని అభినందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై వారితో సుదీర్ఘంగా చర్చించారు.

పట్టపగలే చలిమంటలు..


నేరడికొండ: మంట కాగుతున్న గ్రామస్తులు


ఉట్నూర్‌రూరల్: నేలకొరిగిన వరి

- నిలిచిన వరి కొనుగోళ్లు..

ఉట్నూర్‌రూరల్: తుపాన్ ప్రభావంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఉదయం నుంచి చలిగాలులు వీయడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో మధ్యాహ్న సమయంలో సైతం చలిమంటలు పెట్టుకుని ఉపసమనం పొందుతున్నారు. మరో వైపు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తేలికపాటి వర్షం కురుస్తుండడంతో రైతులు కేంద్రాల వద్ద వరి ధాన్యాలు వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పారు. అలాగే పలుచోట్ల వరిపంట నేలకొరిగింది. తుపాన్ ప్రభావంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేరడిగొండ: వాతావరణంలో మార్పులతో జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. వారం రోజుల నుంచి చలి విజృంభిస్తుంది. చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. గ్రామాల్లో ఉదయం ఎక్కడచూసినా ప్రజలు చలిమంటలు కాగుతూ కనిపిస్తున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు రగ్గులు, జర్కిన్‌లను ఆశ్రయిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు అవస్థలకు గురవుతున్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


ఉట్నూర్‌రూరల్: ధాన్యం తడవకుండా కప్పిన కవర్లు

వణికిస్తున్న మిచాంగ్





మిచాంగ్ తుఫాను ప్రభావం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలను వణికిస్తోంది. జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారిపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిరు జల్లులతో కూడిన ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. దీనికితోడు చల్లని గాలులు వణికిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనుల నేపథ్యంలో గొడుగులు, రెయిన్‌కోట్‌ల సాయంతో బయటకు వస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూర్యుడు కనిపించక మధ్యాహ్నం సమయంలోనూ రాత్రిలా కనిపిస్తోంది.

– సాక్షి ఫోటోగ్రాఫర్– ఆదిలాబాద్

